# రవ్వల ఉంగరం రహస్యం

రచన :
కుమారి రేమణి స్వారాజ్యలక్ష్మి

ఆ రోజు ఫస్టు తారీఖు. బావ జీతం తాలూకు వెయ్యి రూపాయల చెక్కు మార్చుకుని రోజూకన్న కొంచెం త్వరగా యింటికి వచ్చాడు. వస్తూనే అక్కను చూచి —'లేవోయి శశి. నువ్వూ, రాజూ, పిల్లలు త్వరగా ముస్తాబవండి. సురజీమల్సుకిపోయి, నువ్వెన్నాళ్ళ నుంచో మనసు పడుతున్న రవ్వల వుంగరం కొనుక్కుందాం—' అన్నాడు.

బావమాట వినేసరికి అక్క ముఖం థౌజండ్ వాల్ట్ బల్బుమల్లే ప్రకాశించింది. ఎందుకంటే బావ అంతకు ముందే అక్కకి రవ్వల గాజులు, దుద్దులు, నెక్లేసుకొన్నాడు. వాటితోపాటు 'మేచ్' అయేందుకు రవ్వల వుంగరం కూడా వుండాలని అక్క పట్టుదల. అశ్రద్ధ వల్ల కొంతకాలం అనుకోని యితర ఖర్చులు రావడంవల్ల మరికొంత కాలం రవ్వల వుంగరం కొనడం వాయిదా పడుతూ వచ్చింది. అందుకని అవకాశం చిక్కినప్పుడల్లా అక్క సాదించేది. అప్పుడప్పుడు మూతి ముడుచుకుని ఒకటీ, అరా పూటలు (అంతకన్న ఎక్కువ మాత్రం కాదు) బావతో మాట్లాడటం మానేసేది. కాని బావ మాత్రం అక్క అమాయకత్వానికిరవ్వలమీద,ముఖ్యంగా రవ్వల వుంగరంమీద అక్కకున్న మక్కువకు తనలో తనే నవ్వుకునే వాడు.

అందువల్ల ఇన్ని రోజులకి తన కోరిక నెరవేరు తుండటంవల్ల అక్కముఖం చాటంత అవటంలో ఆశ్చర్యం లేదు.

పది నిముషాల్లో అందరం ముస్తాబయి కారెక్కాం. మరో పదిహేను నిముషాల్లో కారు సురజ్‌మల్సుభవనం ముందాగింది. పిల్లల్ని కారులో వదిలి వాళ్ళు అటూ, యిటూ పోకుండా చూస్తుండమని డ్రైవర్ని హెచ్చరించి మేము ముగ్గురము లోపలికి వెళ్లాము. లోపలికి అడుగు పెట్టగానే అచ్చటియజమానులు మమ్మల్ని చాలా ఆదరంగా ఆహ్వానించి కుర్చీలు చూపించి బావ వద్దంటున్నా వినకుండా మూడు 'వింటో' లు తెప్పించిపుచ్చుకుంటే గాని వీల్లేదని బలవంతం చేశారు.

మద్రాసులో పెద్దపెద్ద నగల వర్తకులు బట్టలవర్తకులు తమ ఖాతాదార్లను బోల్తాకొట్టించటానికి వేసే యెత్తుల్లో మొదటిదివారికి డ్రింకులు, కాఫీలు,సిగరెట్లు యిచ్చి సత్కరించటం. అయితే మన కిచ్చిన పానీయాల ఖరీదుకి పది రెట్లు వారు మనకు అమ్మబోయే వస్తువుల వెలలో గుంజు కుంటూ రనుకోండి. అయితే అది వేరే విషయం.

పక్కా గంటసేపు తర్జనభర్జన జరిగిం తరువాత మా ముగ్గురికీ నచ్చిన వుంగరం దొరికింది. అంతవరకూ నాకూ, అక్కకూ నచ్చింది బావకు నచ్చక, బావకూ నాకు నచ్చితే అక్కకి నచ్చక తికమక పడ్డాం. చివరకు ఎలా అయితేనేం ముగ్గురుకీ నచ్చిన ముచ్చటైన వుంగరం దొరికింది. అందులోనూ అది అక్క వేలుకు అతికినట్టు సరిపోయింది, సరె, యికనేం బావ దాని ఖరీదు విచారించాడు. దాని వెల ఏడువందల యాభై రూపాయలని తెలియగానే అక్క ఒక్కసారి తెల్లబోయింది. దమ్మిడీ అంత ముఖం చేసుకుని బావచేయి పట్టుకుని—' రండి, వెడదాం...' అంది. 'ఏం' అన్నాడు బావ తెల్లబోతూ.

'అంత ఖరీదుపెట్టి కొనడం నాకిష్టంలేదు' అంది అక్క.

'ఖరీదు విషయం నీ కెందుకు నీకు వుంగరం నచ్చింది కదా' అన్నాడు బావ. 'ఏమండీ దీని వెల యింతేనా మరో బేరం ఏమయినా చెపుతారా' అని షాపు యజమాని నడిగాడు.

'అదేమి సార్! అట్లదా చెపుతురు! మీరుదా మా అంగిట్లో కిట్ట, కిట్ట యిరవయి వేయిరూపాయ నగ తీసిరి. మీకుదా వెల జాస్తీ చెపుదుమా? ఆరునూరు రూపాయిలిచ్చి తీసుకో సామీ—' అంటూ తనకు కూడా తెలుగు భాషా పాండిత్యం వున్నట్టు మాట్లాడాడు.

'బావ అయిదువందలు అన్నాడు. చివరకు బేరం అయిదు వందల యాభైకి పైసలయింది. ఆపై యాభయి రూపాయలు మా ముగ్గురిచేతా బలవంతంగా తాగించిన వింటోల ఖరీదేమో నని నవ్వుకున్నాం.

తిరిగివచ్చి కారులో కూర్చున్నాం. కారు బయలు దేరింది. అంతవరకూ అక్క చేతివంక అదే పనిగా చూస్తున్న బావ-' నువ్వంటే యేమిటో అనుకున్నాను గాని శశీ! నీ వేలికి ఆ వుంగరం పెట్టుకుంటే చంద్రుడికి సున్నం కొట్టినంత అందంగా వుంది' అన్నాడు. బావ మాటల్లోని గూడార్థం అర్థంచేసుకో లేని అక్క ఆనందంతో మెరసిపోతూ 'అబ్బ' పోదురూ' అంది.

కారుని నెహ్రూకేఫ్ దగ్గర ఆపి కొంచెం కాఫీ ఫలహారాలు పుచ్చుకుని వెల్లింగ్టన్‌లో 'ఏక్ - హీ - రాస్తా' సినిమా చూచుకుని రాత్రి పది గంటల సమయంలో యింటికి చేరుకున్నాం.

పిల్లలు నిద్దరపోయారు. మేము ముగ్గురం మాత్రం సినిమాను గురించి చాలసేపు చర్చించుకున్నాం. సినిమా మీదనుంచి చర్చ మళ్ళి రవ్వల వుంగరం మీదకు మళ్ళింది.

ఇంతలో లోపల వంటావిడ - 'చూడండమ్మాయి. వండిన పదార్థాలన్నీ చల్లారిపోతున్నాయి. రెండు మెతుకులు తినేసి కూర్చుంటే ఆపైన ఎంతసేపయినా మాట్లాడుకోవచ్చు—' అంటూ అక్కనుద్దేశించి అంది.

బావ నవ్వుతూ— 'ఇక ఆవిడకు అన్నం అక్కర్లేదండీ బామ్మగారూ! రవ్వల వుంగరంతోనే కడుపు నిండిపోయింది.' అన్నాడు.

'అవునా తల్లీ! రవ్వల వుంగరం కొనుక్కున్నావా' అంటూ ఆమె అక్కను ఆప్యాయంగా అడిగింది.

'అవునండీ! బామ్మగారూ! చూడండి' అంటూ అక్క లేచి ఆవిడ దగ్గరగా వెళ్ళి వుంగరం ఆమెకు చూపింది.

'బాగుంది తల్లీ! ఎంతయిదమ్మా' అంది ప్రేమగా వంటావిడ.

'అయిదు వందల యాభై అయిందండీ ఆ! బామ్మగారూ మీరు వడ్డించండి నేను ముఖం కడుక్కువస్తాను' అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

ఇక్కడ మా అక్కయ్యగారి వంటమనిషిని గురించి రెండు ముఖ్యమైన మాటలు చెప్పటం చాలా అవుసరం. ఆమె దాదాపు పదిహేను సంవత్సరాల నుంచి అంటే అక్క బావని పెండ్లాడక ముందు నుంచీ కూడా ఆమె వారింట్లో వంట పనిచేస్తూ తలలో నాలుకలా మెసలుతూ తన మంచితనం చేత అందరి ఆదరుపొంది యీ రోజుకు ఆయింట్లో వారు ఏదైనా చిన్న చిన్న తప్పులుచేస్తే మెల్లగా మందలించే అధికారం సంపాదించుకుంది. బావకు మద్రాసులో వుద్యోగం అవటంవల్ల, అక్కా బావ కొత్తగా కాపురం పెట్టటం వల్లనూ పెద్దదిక్కుగా తోడుగా వుంటుందని ఆమెను కూడా తీసుకువచ్చారు.

అన్నాల ముందు కూర్చున్నాం. వంటామె కొసరి కొసరివేస్తూ అప్యాయంగా తినిపిస్తూంది. సినిమాను గురించి చర్చించుకుంటూ భోజనాలు చేస్తున్నాం. వున్నట్టుండి బాత్‌రూంలో ఏదో చప్పుడైంది. వంటావిడ ఆ చప్పుడేమిటో చూసొస్తానని వెళ్ళింది. ఆమె తిరిగి రావటానికి అయిదు నిముషాలు పట్టింది. ఈలోగా బావకు కొంచెం కూర అవసరం రావటం అక్క వడ్డించటం జరిగింది.

వంటామె తిరిగి రాగానే బాత్‌రూంలో అయిన చప్పుడును గురించి అడిగింది. — 'ఏముందమ్మా! పాడు ఎలుకలు చంపుకు తింటున్నాయి. అబ్బాయి రేపు నౌకరుతో చెప్పి ఒకబోను తెప్పించు నాయనా—' అంటూ పులుసు వడ్డించింది.

మజ్జిగ పోసుకుంటుండగా బావ అక్కచేతిని పరీక్షగా చూస్తూ— 'అదేమిటోయ్! వుంగరం అప్పుడే దాచేశావా! వస్తువులు కొనుక్కునేది పెట్టుకోవడానికా? యినప్పెట్టెలో పెట్టి పూజ చేసుకోవటానికా—' అంటూ మందలించాడు.

అక్క తన వేలు చూచుకుని ఒక్కసారి నిర్ఘాంతపోయింది. వెంటనే చివాల్నలేచి వెండికంచం తన్నుకుంటూ బాత్‌రూం వైపు పరుగుతీసింది. అసలు విషయం

అర్థంకాని బావ తను మందలించిన మాత్రాన అక్క అలా లేచిపోయి వుంటుందని తను కూడా లేచి శశీ అంటూ అక్క ననుసరించాడు. నేను వెర్రిమొహం వేసుక కూర్చుండి పోయాను.

బాత్‌రూంలో అక్క కేకలు, బావ సమాధానం. వెంటనే అక్క ఏడుపు విని నేను కూడా అటు పరుగెత్తాను.

అక్క అక్కడ కూర్చుని తలను బాదుకుంటూ ఏడుస్తుంది. బావ ఆమెను సముదాయిస్తున్నాడు.

'ఇక్కడే పెట్టానండీ! కొత్త వుంగరం నీళ్ళకు తడపట మెందుకని తీసి యీ సబ్బుపెట్టె దగ్గరగా పెట్టాను. మొహం కడుక్కొని వచ్చేటప్పుడే ఆ తొందరలో మరచిపోయాను. యీ కొంచెం సేపటిలో ఎలా మాయమైందో' అంటూ వెక్కి వెక్కి ఏడవ సాగింది.

బావ ఆమెను సముదాయిస్తూ 'చూడు శశీ!' అనవసరంగా ఖంగారు పడకు. జాగ్రత్తగా వెతుకుదాం. ఎక్కడికిపోతుంది. ఈ పక్కనే ఎక్కడో వుంటుంది-' అంటూ వెతుక సాగాడు. బాత్‌రూంలో బల్బు మసిపారి కాంతి రహితంగా వుండటంవల్ల అది తీసి చావడిలోని నూరువాల్‌ట్ బల్బు అక్కడ వేసి నాలుగు మూలలా వెతక సాగాడు.

బావ మాటలకు కొంచెం సమాధాన పడిన అక్క ఏడుపు మాని-' యింతలో ఎలా మాయ మయిందండీ! ఎవరూ రాలేదు కూడాను' అంటూ ఏదో ఆలోచన తట్టినట్టు అక్కడే ఓమూల వెతుకుతున్న వంటామెను చూచి-' ఏమండీ బామ్మగారూ! యిందాక మీరు యిక్కడ ఏదో చప్పుడైందని వచ్చారే అప్పుడు మీకు యిక్కడ వుంగరం కనుపడలా-' ఆమె వంక అదోమాదిరిగా చూస్తూ అడిగింది.

'నాకా! వుంగరమా! లేదమ్మా!' అంటూ తెల్లబోయిన వంటావిడ సమాధానం చెప్పింది.

ఆమె మాటలు అక్కకు నమ్మకం కలిగించక పోగా అనుమానం కలిగించాయి.

'అప్పుడే యిక్కడ పెట్టి భోజనానికి వచ్చాను. మరో అయిదు నిముషాల్లో మీరువచ్చారు. యింతలో ఏ బ్రహ్మ రాక్షసి ఎత్తుకుపోయి వుంటుంది' అంటూ ఆమె వంక తీక్షణంగా చూచింది.

నేను వంటామె వంక చూచాను. ఆమె ముఖం భయంతోనూ, సిగ్గుతోనూ పాలిపోయింది.

'నిజం తల్లీ! నేను వుంగరం అసలు చూడలేదు. ఎలుకలు యిటు అటు పరుగెత్తుతూ సబ్బు తింటుంటె మూత వేసి వచ్చాను' అంటూ దీనంగా చూచింది.

అక్క మాట్లాడకుండా ఆమె వంక అదో మాదిరిగా చూసి వూరుకుంది.

ఒక గంట గడిచిన తరవాత యిక వుంగరం బాత్‌రూంలో లేదని నిశ్చయం చేసుకుని అక్క తిరిగి ముఖారి ఆలాపిస్తూ మేడమీదకు వెళ్ళింది. బావకూడా ఆమెను అనుసరించాడు. నేను వంటామె వంక నిదానించి చూచాను. 'నువుకూడా నేను దొంగ ననుకుంటున్నావా' అన్నట్టు ఆమె చూపులు దీనంగా జాలిగా వున్నాయి. నేను సమాధానం చెప్పలేక పైకి వెళ్ళిపోయాను.

'వెంటనే పోలీసు స్టేషనుకు ఫోను చెయ్యండి. ఇది తప్పకుండా ఆవిడ పనే. మరెవరొచ్చారు ... అంటూ అక్క బావను తొందర చేస్తూవుంది.

'తొందర పడకు శశీ! ఆమె మనింట్లో ఏనాటినుంచో వుంది. ఆవిడ చేతిమీదగా యీ యింటి అభివృద్ధికోసం, మనడబ్బే అనుకో, వేలు ఖర్చు పెట్టింది. ఒక కానీ కూడా ఎప్పుడూ తఖారరు రాలేదు. అటువంటి మనిషి యింత నీచానికి పాల్పడుతుందని తోచదు-' అంటున్నాడు బావ.

అక్కకి కోపం వచ్చింది-' అదుగో అటువంటి నమ్మకాలే మన కొంప ముంచుతున్నాయి. ఏ మనిషికి ఏ క్షణాన ఎటువంటి బుద్ధి పుడుతుందో ఎవరు చెప్పగలరు. డబ్బు ఎవరికీ చేదు కాదుకదా! నా మాటవిని మీరు వెంటనే స్టేషనుకు ఫోను చెయ్యండి' అంటూ వత్తిడి చేసింది.

అంతవరకూ మాట్లాడకుండా వింటున్న నేను-' పోనీ బావ చెప్పినట్టు కొంచెం నిదానించ రాదా అక్కా

అంత మంచి మనిషి యిలాటి నీచపు పని చేస్తుందని నాకు నమ్మకం లేదు' అన్నాను.

అక్క నా వంక తీక్షణంగా చూస్తూ-' యీ విషయం నీకు తెలియదు పూరుకో రాజూ! పైకి పెద్ద మనుష్యుల్లా కనపడే వారే లోపల గోతులు తవ్వుతారు-' అలా గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటే యేమండి వెంటనే ఫోను చెయ్యక-' అంది.

ఫోను చెయ్యటానికి బావ ఆఫీసు గదిలోకి వెళ్లాడు. ఎంతో మనసు పడి దాదాపు ఆరువందలు ఖరీదు చేసే వుంగరాన్ని కొన్న కొద్ది గంటలలోనే పోగొట్టుకున్న అక్క ముఖం చూచి నాకు జాలేసింది.

పదిహేను నిముషాల్లో మా బంగళా ముందు పోలీసు జీపు వచ్చి ఆగింది. అందులో ఒక సార్జెంటు యిద్దరు కానిస్టేబుల్సు వున్నారు. ఇంత రాత్రిపూట మరొక చోటి కయితే పోలీసులు మరునా డుదయానికి వాయిదా వేసే వారేమో గాని ఒక ప్రధాన ప్రభుత్వోద్యోగి యింట్లో


తపాలు పెట్టె నం: 211 తంతి: ESEMESARBE

వురైయూర్ చీరలకు ప్రసిద్ధిచెందినది!!

S. M. S. R. B.



ఫోటోమార్కు

100 నం: చేమగ్గముల నూలు చీరలే,
ప్రతివారూ ఆశించేది **S. M. S. R. B.** చీరలునే
ఎంచేతనంటే—అవి

* చక్కని నేతతో,
* గ్యారంటి ఉన్న కలర్లు,
* రకరకముల నూతన డిజైనులతో,
* మా స్వంత మగ్గములలో తయారైనవి.

ఉత్పత్తిదార్లు:

S. M. S. R. బాలసుందరం చెట్టియార్ సన్స్,
36, పంచవర్ణస్వామి కోవిల్ వీధి,
ఉరైయూర్ (Woriur (P.O.) TRICHY-3.

జరిగిన రవ్వల వుంగరం దొంగతనం నేరం విచారణకు వారు రాక తప్పింది కాదు.

పది నిముషాల్లో బావ సార్జెంటుతో జరిగిన దంతా వివరంగా చెప్పాడు.

వెంటనే సార్జెంటు బాత్‌రూంలోకి వెళ్ళి అక్కడ వుంగరం వుంచబడ్డ చోటూ, అక్క ముఖంకడుక్కున్న చోటు, ముఖం తుడుచుకున్న చోటు, నడచిన అడుగులు అన్నీ గుర్తులు చూచుకుని టేపుతో కొలచి క్రింద చతికిలపడి కూర్చుని, వంగి నేలమీద పాకి, నేలంతా, మూలమూలలా తన దగ్గరున్న ఫ్లాష్‌లైట్‌తో వెతికి చూచి ఒక అరగంట తరువాత తన విధి సక్రమంగా నెరవేర్చిన సంతృప్తితో మొఖంమీద చమట రుమాలుతో తుడుచుకుంటూ చిరునవ్వుతో డ్రాయింగ్ రూంలోకి నడిచాడు. అంతవరకూ ఆయనతో పాటు! ఫుట్‌బాల్ ప్లేయరులా యిటూఅటూ పరుగెత్తి కసరత్ చేసిన కానిస్టేబుల్సు చెమటలు కక్కుతూ వీధి బయట గుమ్మం వద్దకుపోయి సార్జంటు చూడకుండా బీడీలు ముట్టించారు.

సార్జెంటు పడ్డకష్టం చూచి అక్క ఎలెక్ట్రిక్ స్టౌ మీద అయిదు నిముషాల్లో వేడివేడి ఓవల్టిన్ రెండు కప్పులు తెచ్చి సార్జంటుకూ, బావకూ యిచ్చింది.

సువాసనలతో పొగలు గక్కుతున్న ఓవల్టైన్ అక్క చేతిలోంచి అందుకుంటూ సార్జెంటు 'థాంక్యూ మిసెస్ రావు' అంటూ వేడి ఓవల్టైన్ చప్పరిస్తూ ఒక్క నిముషం సోఫాలో వెనక్కువాలి కళ్లు మూసుకున్నాడు.

ఉన్నట్టుండి ఏదో ఆలోచన తట్టినట్టు కళ్ళు తెరిచి బావతో—'చూడండి మిస్టర్ రావు! మీరు దయతో కొన్ని ప్రశ్నలకు సమాధానం యిస్తారా' అన్నాడు.

'సంతోషంగా' అన్నాడు బావ.

'మీరు యీ వుంగరం ఎప్పుడు ఎక్కడ కొన్నారు'- సార్జెంటు మొదటి ప్రశ్న—

ఈ విషయం దాదాపు అరగంట క్రితం అతనితో చెప్పినా కూడా మొంగి తనను అదేప్రశ్న అడగటం చూచి ఆశ్చర్యపోయిన బావ—'సాయంత్రం అయిదూ ఆరుగంటల మధ్య చైనాబజారులోని ధీరజ్‌మల్సు షాపులో అయిదువందల యాభైరూపాయలకు నేనూ, నా భార్య, మా మరదలూ వెళ్ళి కొనుక్కువచ్చాం' అంటూ బావ ఒక్కగుక్కలో సార్జెంటు అడగని యితర ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పారు.

'ఆ సమయంలో షాపులో మీరు ముగ్గురు తప్ప యితరు లెవరైనా వున్నారా' సార్జెంటు రెండవప్రశ్న.

'మేమూ, మాలాగే షాపులో నగలు కొనటానికి వచ్చిన యితరులు నలుగు రయిదుగురు షాపు సిబ్బందీ కూడా వున్నారు' అన్నాడు బావ నవ్వు దాచుకుంటూ.

సార్జెంటు అమాంతం సోఫాలోంచి గంతేసి నిలబడి-' అదే - అదే ఆ యితర బేరగాళ్ళల్లో మీకు అనుమానాస్పదు లెవరైనా వున్నారా - బాగా ఆలోచించి చెప్పండి. పరవా లేదు' సార్జెంటు అన్నాడు.

బావ నవ్వుతూ 'అందులో పెద్ద ఆలోచించాల్సిన విషయం ఏమీ లేదు. వారిలో ఒకరు జిల్లాజడ్జిగారి కుమార్తె, ప్రఖ్యాత న్యాయవాది శంకరరావుగారి సోదరుడు వారి భార్య, యిక మిగిలిన నాలుగవవారు జిల్లా కలెక్టరుగారి మేనల్లుడు రమేశ చంద్ర - యీ నలుగురిలో అనుమానాస్పదు లేవరో మీరే నిర్ణయించండి' అన్నాడు.

'సార్జెంటు నాలుక కరుచుకుంటూ సోఫాలో కూలబడి-' అయితే మీరు షాపునుండి సరాసరి యింటికే వచ్చారా అన్నాడు.

ఈ ప్రశ్నకు కూడా సమాదానం యింతకు పూర్వం యిచ్చి వుండటంవల్ల బావ కొంచెం విసుగ్గా—' ధీరజ్ మల్సునుండి బయలుదేరి నైహరూ కేఫ్‌కు అక్కడి నుండి వెల్లింగ్టన్‌కు పోయి యింటికి వచ్చాం' అన్నాడు.

'థాంక్యూ మిస్టర్ రావ్! యిక మీరు చెప్పాల్సిందేమీ లేదు-' అంటూ అక్కను చూచి-' మిసెస్ రావు! యిటువంటి విచార సమయంలో మీకు శ్రమ కలిగించాల్సి వచ్చినందుకు చాలా చింతిస్తున్నాను. అయినా నా ధర్మం నేను నిర్వర్తించాలి కాబట్టి మీరు నే నడుగ

జోయి కొన్ని ప్రశ్నలకు సమాధానం యిస్తారా' అన్నాడు.

'తప్పకుండా - అడగండి' అంది అక్క.

'అయితే మీరు యింటి కొచ్చిన తరవాత వుంగరం చూచు కున్నారా' - సార్జెంటు ప్రశ్నించాడు.

చూసుకోవటమే కాదు దాన్ని గురించి చర్చించు కున్నాం కూడా-' యింత బుర్ర లేని ప్రశ్న అడిగాడేమా అని తెల్లపోయి అంది అక్క.

'అయితే మీరు ఆఖరు సారి ఆ వుంగరాన్ని ఎప్పుడు చూచారు-' సార్జెంటు మళ్ళీ అక్కని ప్రశ్నించాడు.

ఇంతవరకూ బలవంతంగా ఆపుకున్న నవ్వు యిక బావ నిలుపుకో లేక సార్జెంటుతో క్షమార్పణ చెప్పుకుని హాయిగా నవ్వుకు నేందుకు బయటకు వెళ్ళిపోయాడు.

నేను నవ్వు పైకి కనబడకుండా పమిట కొంగు నోటి కడ్డం వుంచాను.

అంతవరకూ వుంగరం పోగొట్టుకొన్న విచారంలో వున్న అక్క కూడా యీ ప్రశ్న నవ్వు తెప్పించింది. ఆమె నవ్వును బలవంతంగా దిగమింగి-' నేను బాత్ రూంలో ముఖం కడుకుంటూ తడిసిపోతుందని వేలు నుంచి తీసి క్రింద పెట్టునప్పుడే ఆ వుంగరాన్ని ఆఖరు సారి చూచాను-' అంది.

'థాంక్యూ మిసెస్ రావ్! మరొక్క ప్రశ్న - యీ యింట్లో మీ రెవరినైనా అనుమానిస్తున్నారా' అన్నాడు సార్జెంటు.

ఆ ప్రశ్నతో అక్క ముఖం గంభీర మయింది. ఒక్క నిముషం ఆలోచించి అన్నం వడ్డించి వంటామె బాత్

ఆంధ్రప్రదేశ్ అవతరణ శుభసందర్భాన మాహృదయపూర్వక వందనములు!
రంగూనునుంచి అసలు రంగూను వీలుమార్కు చెన్నీస్ వజ్రాలు వచ్చియున్నవి.
ఒరిజినల్
రిజిస్టర్డ్ వీల్ మార్కు వజ్రాలు రిజిస్టర్డ్
ప్రసిద్ధమైన
చెన్నీస్ వజ్రాలు
అన్ని పట్టణాలలోనూ షరాబువ్యాపారులవద్ద దొరకును
చెన్ని రాధాకృష్ణ & కో., పెద్దబజారు, తిరుచునాపల్లి
మీకు కావలసినవాటికి: చెన్ని రాధాకృష్ణ అండ్ కో.,
పెద్ద బజారు :: తిరుచిరాపల్లి.

రూంలో చప్పుడు విని అక్కడకు వెళ్ళటం. తను ఆమెను వుంగరం గురించి అడిగినప్పుడు తనకేమీ తెలియదంటూ తడబడుతూ సమాధానం చెప్పటం వగైరా చెప్పింది.

సార్జెంటు ఒక్క అదటున సోఫాలోంచి లేచి—'యింత వరకూ మీరు యీ విషయం నాతో ఎందుకు చెప్పలేదు?' అంటూ 'ఓయ్ నాట్-నాట్-ఫోర్! ఆ వంటామెను వున్నట్టుగా తీసుకురా!' అన్నాడు.

అయిదు నిముషాల్లో వంటామె సార్జంటు ముందుకు తీసుకురాబడింది. ఆమె వెనుకనే హాయిగా నవ్వుకునేందుకు బైటకు నడిచిన బావ కూడా లోపలకు వచ్చాడు.

ఆమెను ఒక్క నిముషం పరాకాయించి చూచి సార్జెంటు-'మీరు బాత్‌రూంలోకి ఎందుకు వెళ్ళారు?' అంటూ గర్జించాడు.

'ఏదో! చప్పుడు వినిపిస్తే వెళ్ళాను' బిక్కచచ్చిన వంటామె సమాధానం.

'అక్కడ మీరెంత సేపున్నారు' సార్జెంటు గంభీరంగా అడిగాడు.

'దాదాపు అయిదు నిమిషాలు'

'చప్పుడేమిటో చూచి రావటానికి అయిదు నిముషాలు పట్టిందా' తిరిగి గర్జించాడు సార్జెంటు.

ఈసారి వంటామె మౌనం వహించింది.

'బాగా ఆలోచించి చెప్పండి! యిప్పుడు మీరు చెప్పబోయే ప్రతిమాటా రేపు కోర్టులో మీకు వ్యతిరేకంగా తీసుకోబడుతోంది' రెట్టించాడు సార్జెంటు,

బావ తెల్లపోతూ సార్జెంటువంక చూచాడు. నాకంతా అయోమయంగా వుంది.

'ఊ! మీరు అయిదునిముషాలు బాత్‌రూంలో ఎలా గడిపారో చెప్పగలరా' తిరిగి అడిగాడు సార్జెంటు.

వంటామె ఒక్కక్షణం నిదానించి మెల్లగా అంది 'కడుపుబ్బుకు రాగా...' ఆపైన చెప్పలేక వంటామె సిగ్గుతో కుంచుకుపోయింది. అప్పటి ఆమె పరిస్థితి 'నన్ను యీ అవమానపాలు చెయ్యటంకన్న నీలో కలుపుకో తల్లీ' అంటూ భూదేవిని ప్రార్థిస్తున్న జానకీదేవిలా వుంది. ఆమె కళ్ళవెంట అశ్రుధారలు రాలుతున్నాయి. నా మటుక్కు నాకు ఆమెమీద జాలివేసింది.

సార్జెంటుమాత్రం- 'అబద్ధం - నువ్వు అబద్ధం చెపుతున్నావు. శ్రీమతి శశిరావుగారి రవ్వల వుంగరం దొంగిలించిన నేరంమీద యిప్పుడు నిన్ను అరెస్టుచేస్తున్నాను' అంటూ ప్రక్కనున్న పోలీసులకు సంజ్ఞ చేశాడు. వారిద్దరు సినిమాలో బొమ్మల్లావచ్చి ఆమెకు చెరివక వైపూ 'అటెంక్షన్'లో నిలబడ్డారు.

ఆమె ఏడుస్తూ బావవంక చూచి - 'నాయినా! నాకే పాపం తెలియదు. నా విషయం అమ్మాయికి కొత్తయినా నీకు కొత్తగాదు. నిన్ను చాలా చిన్నతనంనుంచి ఎంతో గారంబంగా ఎత్తుకు పెంచాను. ఈ ఇంటికి పెద్ద దిక్కగావచ్చి యింత నీచపు పని కొడిగడతానా! యింత అవమానం భరించటంకన్న నేను చచ్చిపోయినా బాగుండును' అంది. నాకు ఆమెమీద విపరీతమైన జాలి కలిగింది. బావ వంక చూచాను. బావ నేత్రాలుకూడా అంత బాధను వెలువరిస్తున్నాయి. అక్కమాత్రం ముఖం చిట్లించుకుంది.

బావ మెల్లగా సార్జెంటుతో - 'చూడండి' మీరు కొంచెం తొందరపడ్డారనుకుంటాను. ఆమె మా యింట్లో పదిహేను సంవత్సరాలుగా వుంది. ఇంతవరకూ మా యింట్లో పూచిక పుల్లకూడా పోలేదు నిజం చెప్పాలంటే ఆమె మా యింటికి వచ్చిన తరువాతే అంతకు ముందు అడపాదడపా జరిగే దొంగతనాలు మాయమయ్యాయి. అటువంటి మనిషి యీ పని చేస్తుందని నేను నమ్మలేకుండా వున్నాను-' అన్నాడు.

సార్జెంటు గంభీరంగా—మిస్టర్ రావ్! యీ వంటవాళ్ళూ, కారు డ్రైవర్లు మొదలైనవారున్నారు చూచారూ! వీరందిరిది అది వక తరహా! మొదట కొంత కాలం ఎంతో నమ్మకంగా వున్నట్టు నటిస్తారు. యజమానుల మంచితనం, నమ్మకం సంపాదించి తరువాత యిష్టమొచ్చినట్టు యిల్లు గుల్లచేస్తారు. నా సర్వీసులో యిటువంటి దొంగతనాలు ఎన్నో చూచాను. మీరు యీమె విషయం జాలి పడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. ఆమె మీకు నమ్మక ద్రోహం చేసింది. అసలు విషయం ఎంత తేలికయినదో మీరు గ్రహించినట్టు కనబడదు. నేను విపులీకరిస్తాను చూడండి'

'ఒకామె మీవద్ద వంటకు కుదురుతుంది. ఆమె పుట్టు పూర్వోత్తరాలు గానీ యితర విషయాలు గానీ మీకు తెలియవు. ఆమె మీ అభిమానం సంపాదించాలని మీ వద్ద అత్యంతభక్తి శ్రద్ధలతో పనిచేస్తున్నట్టు నటిస్తుంది. మీరు అమాయకు లవటం వలన ఆమె నటన నిజమని నమ్ముతారు. మీకు పరాయి పూళ్ళో వుద్యోగం అవుతుంది. మీరు మీతోపాటు ఆమెనుకూడా తీసుక వస్తారు. అప్పటినుంచీ ఆమె దొంగతనం చేసేందుకు సరైన అవకాశం కోసం వేచివుంటుంది. ఇంతకీ మీరు, శ్రీమతి శశీరావుగారు, మీ మరదలుగారూ వుంగరం కొనుక్కొని కాఫీతాగి, సినిమా చూసియింటికివచ్చారు. వుంగరం చూడగానే యీామె ఒక వుపాయం ఆలోచిస్తుంది. అందుకని శ్రీమతి రావుగార్ని భోజనం చల్లారి పోతుందనే నెపంతో త్వరగా రమ్మని త్వరపెడుతుంది. మాయమర్మం యెరుగని శ్రీమతి రావుగారు త్వరగా బాత్‌రూం లోకివెళ్ళి ముఖం కడుక్కొని యీ మనిషి త్వరపెట్టటం వల్ల వుంగరం మరచిపోయి భోజనానికి వస్తారు. ఆమె వ్రేలి వుంగరం లేదన్న విషయం అందరికన్న ముందు వంటామె గ్రహిస్తుంది. ఆమె అతి త్వరగా ఆలోచిస్తుంది. 'బాత్‌రూం లోకి వెళ్ళేటప్పుడు వ్రేలని వున్న వుంగరం బయటికు వచ్చేసరికి లేదు అందువల్ల అదితప్పక బాత్‌రూంలోనే వుండి వుంటుందని వూహించి వుంగరం

ఆంధ్రప్రదేశ్ అవతరణ శుభసందర్భములో మా హృదయపూర్వక అభినందనలు !

ENJOY BY SMOKING THE GREAT
3 HORSE BEEDIES

శ్రేష్ఠమైన పొగాకుతో తయారు కాబడిన 3 గుఱ్ఱముల బీడీలను కాలాది కాలమునుంచి వాడుతూ, మన ఆంధ్రరాష్ట్రములో లక్షలాది ప్రజలు ఆనందమును, ఉత్సాహమును పొందుచున్నారు. శ్రేష్ఠమైన 3 గుఱ్ఱముల బీడీలతో ఇతర రకముల బీడీలను, విలువైన సిగరుట్లను పరీక్షించిన వాటి విలువ మీకే తెలియును.

3 గుఱ్ఱముల బీడి కంపెనీ,
విజయనగరం సిటి

3 HORSE BEEDI COMPANY, VIZIANAGARAM CITY
Telegram : THREE HORSE Telephone 6

వ్రేలిన లేదని శ్రీమతిరావుగారు గ్రహించేలోపునే తను చప్పుడవుతోందనే నెపంతో బాత్‌రూంలోకి వెళ్ళి అక్కడ వుంగరం భద్రపరుస్తుంది. తరువాత ఏమీ ఎరగనట్టు బయటకువచ్చి మీ అందరితో పాటు వుంగరం వెతికినట్టు అభినయిస్తుంది. అందుకు నిదర్శనంగా ఆమె బాత్‌రూంలో అయిదు నిముషాలు ఎలాగడిపిందీ అనే ప్రశ్నకు ఆమె యిచ్చిన సమాధానం ఎంతమాత్రం తృప్తికరంగా లేదు.' అంటూ సుదీర్ఘమైన తన పరిశోధనా ఫలితాన్ని పాఠం వప్పగించినట్టు మాకుచెప్పి తను ఒక 'షెర్లాక్ హోమ్సు'—అంతకన్న గొప్పవాడివై పోయానని పొంగిపోతూ చలాకీగా సిగరెట్టు ముట్టించాడు.

తను వంటమనిషి మీద అనుమానపడి మోపిన నేరాన్ని యింత చక్కగా సమర్థించిన సార్జెంటుకు అక్క మరోకప్పు వేడి ఒవల్టైన్ అందించింది.

దాదాపు తెల్లవారి మూడు గంటల ప్రాంతంలో సార్జెంటు తన ఖైదీని తీసుకుని పోలీసు జీపులో వెళ్ళిపోయాడు. ఆరాత్రి మిగిలిన మూడు గంటలూ నాకు నిద్ర పట్టలేదు. కన్నుమూస్తే దీనంగా నావంక చూస్తూన్న వంటామె ముఖం కనిపించ సాగిదింది.

* * *

ఒక వారం రోజులు గడిచాయి. అంతకన్న దొర్లాయి అంటే బాగుంటుంది. ఎందుకంటె ఆ వారం రోజులూ యింట్లో పూర్వపు వుత్సాహం లేదు. బావ సరసాలు, అక్క ప్రణయకోపాలు, సినిమాలు, బీచి షికార్లు అన్నీ బందయిపోయాయి. అక్క తన కోపాన్నంతా పిల్లల మీద ప్రతి చిన్న విషయంలోనూ చూప సాగింది. అందువల్ల పగలంతా నేను పిల్లలతో నా గదిలో కాలక్షేపం చెయ్యసాగాను.

ఈ వారం రోజులలోనూ సార్జెంటు మరో రెండు సార్లు మా యింటికివచ్చి త్వరలో వుంగరం తెచ్చి అక్కకు అప్పగించగలనని హామీయిచ్చి మరో రెండు కప్పులు వేడి ఓవల్టెన్ తాగివెళ్లాడు. ఈ కేసులో తనకు పేరు ప్రఖ్యాతులు రావటమేగాక ప్రమోషన్ కూడా వస్తుందనే గట్టినమ్మకం అతనిలో కలిగింది.

ఆ రోజు ఆదివారం. బొంబాయిలో యిన్‌కంటాక్సు ఆఫీసరుగా పనిచేస్తున్న బావ స్నేహితుడొకాయన మద్రాసురాగా బావ ఆ రోజు ఆయనను భోజనానికి పిలిచారు. మరో సమయంలో అయితే అక్క అతిథి మర్యాద బ్రహ్మాండంగా గావించేదేగాని యిటువంటి సమయంలో ఆయన రావటం అక్కకెంతమాత్రం యిష్టం లేదు. తప్పనిసరిగా వంటచేసి (వంటమనిషిని జైలుకు పంపడంతో ఆహార శాఖనూ అక్కే నిర్వహించాల్సి వచ్చింది) ఆ వచ్చిన అతిథికి బావకు వడ్డించింది అక్క.

తమ చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుంటూ వారిద్దరూ భోంచేస్తున్నారు. నేను అక్కపక్కగా నిలబడి వారికి కావలసిన పదార్థాలు జాగ్రత్తగా వడ్డిస్తున్నాము. ఇంతలో బావ స్నేహితుడు అన్నంలోంచి గట్టికరుడు కలుపుతూ అందులోంచి వుంగరం బైటికితీసి నవ్వుతూ బావతో - 'యిదేమిటోయ్! అన్నంలో బంగారంకూడా వేసి వండుతారా ఏమిటి' అన్నాడు. బావ ఆయన వంక ఆశ్చర్యపోయి చూస్తూవుండిపోయాడు. అక్క ఒక్క అంగలో వెళ్ళి పరాయి పెద్దమనిషనే మాటకూడా మరిచిపోయి ఆయనచేతిలోంచి వుంగరం వూడలాక్కొని తనివి తీరా దానివంక చూడసాగింది. యీసారి ఆ పెద్దమనిషి తెల్లబోతూ 'ఏమిటి' అన్నట్టు బావ వంక చూచాడు.

ఒక్క నిముషం తరువాత బావ యిల్లంతా అదిరిపడేట్టు నవ్వసాగాడు. ఆ వచ్చిన పెద్దమనిషికి యిదేమీ అర్థంగాక మా ముఖాలవంక చూస్తూ కూర్చుండిపోయాడు.

అప్పుడు బావ ఆయనతో వుంగరం పోవటం దగ్గరనుంచి నడచిన సమాచారం అంతా చెప్పి 'అయితే వంటామె దొంగిలించుకు పోయిన యీ వుంగరం యీ అన్నంలో దొరకటం చాలా విచిత్రంగా వుంది' అన్నాడు.

బావస్నేహితుడు ఒక్క క్షణం గంభీరంగా ఆలోచించి—'చూడురావు! నువ్వు వంటామెను అరెస్టు చేయించడంలో క్షమించరాని తప్పు చేసావు. పాపం

ఆమె నిర్దోషి. ఒకవిధంగా యిలా జరిగివుంటుంది. శశి గారు వుంగరాన్ని బాత్‌రూంలో వదలిరావడంతో అది లైటుకాంతికి తళతళ మెరుస్తుండటంవల్ల అక్కడ తిరిగే ఎలికల్లో ఒకటి నోట కరుచుకుని పోయివుంటుంది. యింతలో వంటామె అదిలించడంతో అది సరాసరి స్లోర్‌రూమ్‌లోకి పోయి అక్కడనుంచి బియ్యపు రమ్ములోకి పోయివుంటుంది. బంగారం కొరుకుడు పడక పోవటంవల్ల దాని నక్కడ వదిలిపోయింది. బియ్యం తియ్యడంలో క్రిందామీదా అయిన యీ వుంగరం చివరికి యీనాడు ఆ బియ్యంతోపాటు బయటికి వచ్చి వాటితోపాటు వుడికినా అన్నంలోకి వచ్చింది.' అంటూ క్లుప్తంగా తన పరిశోధన ముగించి స్టోర్‌రూంలోకి వెళ్ళి అక్కడి బియ్యపురమ్ములో దొరికిన ఎలిక పెంటికలు తెచ్చి తను చెప్పింది తప్పకుండా నిజమని ససాక్ష్యంగా ఋజువు పరచాడు.

వుంగరం దొరికిందన్న ఆనందంతో అంతవరకూ తళతళలాడిన అక్క ముఖం ఒక్కసారి చిన్నబోయింది. బావనుద్దేశించి 'వెంటనే స్టేషనుకు ఫోనుచెయ్యండి. సార్జెంటును మన యింటికిరమ్మని' అంటూ దీనంగా చూచింది.

మరో పది నిముషాల్లో పోలీసు జీపులో సార్జెంటు వచ్చాడు. బావ అతనితో జరిగిదంతా వివరంగా చెప్పి వెంటనే వంటామెను విడుదల చెయ్య వలసిందిగా కోరాడు.

సార్జెంటు తెల్లబోతూ యింత రభసకూ కారణమయిన రవ్వలవుంగరం వంక వక్కసారి కోపంగాచూచి —'ఎట్లాగండి ఆమె మీద డైరీకూడా వ్రాయటం అయిపోయిందే యింత త్వరగా విడుదల చెయ్యటమంటే మాటలా రెండు మూడు రోజులు పట్టచ్చు—' అన్నాడు గంభీరంగా.

'అలా వీల్లేదు. మీరు తలచుకుంటే జరగని పనంటూ వుండదు—ఆమెను మీరు విడుదలచేసేదాకా నేను పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టుకోను - పదండి నేను కూడా కార్లో మీతోపాటు వచ్చి ఆమె కాళ్ళమీద పడి క్షమాపణ చెప్పుకుంటాను. అక్క వుద్రేకంగా అంది.

బావా నేను చాటుగా నవ్వుకున్నాం.

తనకు పేరు ప్రతిష్టలు, ప్రమోషన్ రావటం అలా వుంచి ఒక నిర్దోషిని అరెస్టు చేసినందుకు పై అధికార్లకు సంజాయిషీ యిచ్చుకోవల్సివచ్చిన సార్జెంటు, కన్యాశుల్కంలో గిరీశం పోజుపెట్టి—'డామిట్ కథ అడ్డం తిరిగిందే' అంటూ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.



SEENU & CO., 28. K. TANDAVARAYA GRAMANI ST. MADRAS-21.
GRAMS: "ORCAS" (ESTD 1946) PHONE 55357.
BRANCH: SINGAPORE-8 (CEYLON) AGENTS: N.C.M. STORES 82, MAIN ST. COLOMBO-11.
(ADVT. PERMITTED UNDER G.O.MS. NO 1121 HEALTH)